క్లుప్తంగా

కంగ్టి ఎంపీఓగా లక్ష్మణ్



ఎంపీఓను సన్మానించిన సిబ్బంది

కంగ్టి(నారాయణఖేడ్): మండల పంచాయతీ అధికారిగా డి.లక్ష్మణ్ బుధవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. ఎంపీడీఓ సత్తయ్య, కార్యాలయ సిబ్బంది శాలువాతో సన్మానం చేసి ఆహ్వానించారు. కంగ్టిలో రెండేళ్లుగా పంచాయతీ సెక్రటరీ సుభాష్, ఎంపీఓగా విధులు నిర్వహించారు.

భూభారతిపై సమీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న రాజేందర్

మునిపల్లి(అందోల్): భూ భారతి, మీసేవ దరఖాస్తులపై రెవెన్యూ డివిజనల్ అధికారి రాజేందర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. బుధవారం మునిపల్లి తహసీల్దార్ కార్యాలయంలో సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. గ్రామ పరిపాలన అధికారులతో సాదాబైనామాలపై సమావేశంలో చర్చకు వచ్చింది. ఎంపీడీఓ కార్యాలయ అధికారులతో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఉప తహసీల్దార్ ప్రదీప్, ఆర్ఐ సుభాష్ పాల్గొన్నారు.

నిధులు మంజూరు చేయండి



కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న కార్పొరేటర్

రామచంద్రాపురం(పటాన్‌చెరు): జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్‌వి. కర్ణన్‌ను రామచంద్రాపురం డివిజన్ కార్పొరేటర్ బి.పుష్ప బుధవారం ఆయన కార్యాలయంలో కలసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా స్థానిక విలేకరులతో ఆమె మాట్లాడుతూ.. డివిజన్ పరిధిలోని కాలనీల్లో పలు అభివృద్ధి కార్యక్రమాలకు నిధులు మంజూరు చేయాలని కోరినట్లు తెలిపారు. అందుకు ఆయన సానుకూలంగా స్పందించారని తెలిపారు.

కార్మికులకు కాస్మెటిక్ కిట్ల పంపిణీ



కాస్మోటిక్ కిట్లను అందుకున్న కార్మికులు

నారాయణఖేడ్: మున్సిపాలిటీ కార్యాలయ ఆవరణలో బుధవారం పారిశుద్ధ్య కార్మికులకు కమిషనర్ జగ్జీవన్ ఆదేశాల మేరకు శానిటరీ అధికారి శ్రీనివాస్ కాస్మోటిక్ కిట్లను అందజేశారు. పారిశుద్ధ్య పనులను చేస్తున్న క్రమంలో కిట్లలోని వస్తు, సామగ్రితో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పట్టణాన్ని పరిశుభ్రంగా ఉండేలా కృషి చేయాలన్నారు.

విద్యార్థినికి సత్కారం



సంజనను సత్కరిస్తున్న గ్రామస్తులు


జహీరాబాద్: మండలంలోని హుగ్గెల్లి గ్రామానికి చెందిన విద్యార్థిని సంజన ఎంబీబీఎస్ సీటు సాధించింది. బుధవారం గ్రామస్తులు ఆమెను శాలువాతో సత్కరించి అభినందించారు. మండల పరిధి హోతి(కె) గ్రామంలోని ప్రభుత్వ గురుకుల పాఠశాలలో చదువుకుంది. 10వ తరగతిలో 9.3 జీపీఏ సాధించింది. అనంతరం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు కళాశాలలో ఇంటర్మీడియట్ చదువుకుని 974 మార్కులు సాధించింది. నీట్ ప్రవేశపరీక్షలో ప్రతిభ చాటి 478 మార్కులు సాధించి ఎంబీబీఎస్‌లో ప్రవేశం పొందింది. ఈ మేరకు మాజీ ఎంపీటీసీ రాములు, గ్రామస్తులు కిషన్‌రాథోడ్, నర్సింహారెడ్డిలు సత్కరించి, స్వీట్లు పంచారు.

పండుగ పూట నీటి కటకట

జహీరాబాద్ టౌన్: దసరా పండగ వేళ నియోజకవర్గంలో నీటి కటకట నెలకొంది. దీంతో ప్రజలు నానాఅవస్థలు పడుతున్నారు. మిషన్ భగీరథ కార్మికులు వేతనాలు చెల్లించడం లేదని విధులకు దూరంగా ఉంటున్నారు. దీంతో నీటి సరఫరా చేసే వారు లేక జహీరాబాద్, కోహీర్, మొగుడంపల్లి, న్యాల్‌కల్, ఝరాసంగం మండలాల్లో నీటి సరఫరా నిలిచిపోయింది. అధికారులు వెంటనే స్పందించి మంచి నీటి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

మహిషాసుర మర్దినిగా జగన్మాత

దేవీ శరన్నరాత్రుల ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. బుధవారం అమ్మవారు మహిషాసురమర్దినిగా భక్తులకు దర్శనమిచ్చారు. పలు ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ప్రత్యేక పూజలు, హోమాలు కుంకుమార్చన, నిర్వహించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.



పటాన్‌చెరు టౌన్: మహిషాసురమర్దినిగా రేణుక ఎల్లమ్మ



సంగారెడ్డి టౌన్: ఇస్మాయిల్‌ఖాన్ పేట ఆలయంలో..



మునిపల్లి: ఖమ్మంపల్లిలో..

ఎన్నికల బాధ్యత సెక్రటరీలదే



సమావేశంలో పాల్గొన్న అధికారులు

కంగ్టి(నారాయణఖేడ్): గ్రామ పంచాయతీ ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలు బాధ్యత పంచాయతీ సెక్రటరీలదేనని ఎంపీడీఓ సత్తయ్య తెలిపారు. బుధవారం కంగ్టిలోని ఎంపీపీ సమావేశ మందిరంలో రెవెన్యూ, పంచాయతీరాజ్, పోలీసు శాఖల అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం గత నెల 29న ఎన్నికల షెడ్యూల్ ఇచ్చింది. దీంతో అధికారులు తీసుకోవాల్సిన చర్యలు వివరించారు. ఆలసత్వం వహిస్తే చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ భాస్కర్, ఎంపీఓ లక్ష్మణ్, సీఐ వెంకట్‌రెడ్డి, పోలీసు సిబ్బంది, పంచాయతీ సెక్రటరీలు, గ్రామపాలన అధికారులు పాల్గొన్నారు.

భక్తిమార్గంలో నడుచుకోవాలి



హోమం చేస్తున్న సంగ్రామ్ మహరాజ్

కల్హేర్(నారాయణఖేడ్): గిరిజనులు భక్తిమార్గంలో నడుచుకోవాలని కొండాపూర్ ఆశ్రమ పీఠాధిపతి సంగ్రామ్ మహరాజ్ హితబోధ చేశారు. నిజాంపేట మండలంలోని బల్కంచెల్క తండాలో బుధవారం గిరిజనులు భవానీమాత దీక్షలు విరమణ చేశారు. విశ్వపాళిని భవానీ సమేత సేవాలాల్ మహరాజ్ మహా మందిరంలో 41 రోజుల దీక్షలను పీఠాధిపతి సంగ్రామ్ మహరాజ్ చేతుల మీదుగా విరమించారు. మందిరం వద్ద హోమం, హారతి, ఇతర కార్యక్రమాలు చేపట్టారు. తండాలో భక్తిపారవశ్యం నెలకొంది. సంగ్రామ్ మహరాజ్ ప్రవచనం చేశారు. తండాలో సంగ్రామ్ మహరాజ్‌ను పూర్ణహుతితో స్వాగతం పలికారు. కార్యక్రమంలో తండా ప్రముఖులు శంకర్, ఖత్రోత్ జైలెసింగ్, రాములు, రూప్‌సింగ్, కిషన్, సవాయ్‌సింగ్, మన్మోహన్‌నాయక్, పండరి, నరేందర్ పాల్గొన్నారు.

భవానీ భక్తుల పాదయాత్ర



ప్రారంభమైన భవానీ భక్తుల పాదయాత్ర

జహీరాబాద్ టౌన్: ఛత్రపతి శివాజీ మహరాజ్ నిర్మించిన పవిత్ర పుణ్యక్షేత్రం భవానమ్మపల్లికి భక్తులు పాదయాత్ర చేపట్టారు. పట్టణంలోని భవానీ మందిరం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి పెద్ద సంఖ్యలో కాలినడకన బయలుదేరి వెళ్లారు. భవానమ్మపల్లి తుల్జాభవానీ ఆలయంలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తారు. మూడు రాష్ట్రాల నుంచి భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుంటారు. కార్యక్రమంలో భవానీ పాదయాత్ర కమిటీ సభ్యులు ఎంజీ.రాములు, నర్సింలు, శ్రీనివాస్ గొల్ల, పెద్దగొల్ల నారాయణ, శంకర్‌సాగర్, విశ్వనాథ్ యాదవ్, శివ ప్రసాద్ మాదినం, రమేశ్, ఆనందీశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

పెరిగిన భూగర్భ జలాలు



చేతి పంపు నుంచి ఉబికి వస్తున్న నీరు

న్యాల్‌కల్(జహీరాబాద్): మండలంలో వానలు దంచి కొట్టాయి. భారీ వర్షాల కారణంగా వాగులు, వంకలు పొంగిపొర్లాయి. చెరువులు నిండి అలుగు పారుతున్నాయి. భూగర్భ జలాలు ఘణనీయంగా పెరిగాయి. జూన్ నుంచి సెప్టెంబర్ చివరి వరకు 641.6 మిల్లీ మీటర్ల వర్షం కురవగా 875.2 మిల్లీ మీటర్ల వర్షం కురిసింది. అంటే కురవాల్సిన దాని కంటే 233.6 మిల్లీ మీటర్ల వర్షం అధికంగా కురిసింది. దీంతో భూగర్భ జలాలు పెరిగి బోరు బావులు, చేతి పంపుల నుంచి నీరు దానంట అదే పైకి ఉబిగి వస్తుంది. నీరు పైకిఉబికి వస్తుండటంతో ప్రజలు ఆసక్తిగా చూస్తున్నారు.



పరవళ్లు తొక్కుతున్న సింగూరు

సింగూరుకు కొనసాగుతున్న వరద

పుల్‌కల్(అందోల్): సింగూరు ప్రాజెక్టుకు వరద కొనసాగుతోంది. మహారాష్ట్ర, కర్ణాటకలో భారీ వర్షాలు కురవడంతో భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. దీంతో డ్యాం 11 గేట్లను ఎత్తి దిగువకు నీటిని వదులుతున్నారు. బుధవారం 106725 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రావడంతో ప్రాజెక్టులో 18 టీఎంసీల నీరు నిల్వ ఉంచి మిగతా నీటిని దిగువకు వదులుతున్నారు.

గుమ్మడిదల ఇన్‌చార్జి ఎంఈఓగా పొలీనా

జిన్నారం (పటాన్‌చెరు): గుమ్మడిదల మండలం ఇన్‌చార్జి ఎంఈఓగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అన్నారం పొలినా బుధవారం బాధ్యతలు స్వీకరించారు. జిల్లా విద్యాధికారి ఆదేశాల మేరకు ఎంఈఓగా నియామకమయ్యారు. గత సెప్టెంబర్ మాసంలో ఇన్‌చార్జి ఎంఈఓగా రాంబాబు ఉద్యోగ విరమణ చేశారు. ఆయన స్థానంలో పొలినా కొనసాగనున్నారు. పాఠశాల విద్య అభివృద్ధికి అన్ని విధాల కృషి చేస్తానని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పలువురు ఉపాధ్యాయులు ఆమెను ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

క్రషర్ నిర్వహణపై గ్రామస్తుల నిరసన

జిన్నారం (పటాన్‌చెరు): జిన్నారం మున్సిపాలిటీ పరిధిలోని రాళ్లకత్వ గ్రామం సర్వే నంబర్ 286లో నిర్వహిస్తున్న కంకర క్రషర్ పనులు నిలిపివేయాలని హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు గ్రామస్తులు కొనసాగుతున్న క్రషర్ కార్యకలాపాలను వెంటనే నిలిపివేయాలంటూ నిరసన వ్యక్తం చేశారు. అనంతరం గ్రామస్తులు జిన్నారం సీఐ నయీముద్దీన్‌ను కలిసి హైకోర్టు నోటీసు కాపీలు అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ... క్రషర్ యజమాన్యాలు వెంటనే పనులను నిలిపివేసేలా చర్యలు తీసుకోవాలని పోలీసులకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు యువకులు తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలపై ఆగ్రహం

జిన్నారం (పటాన్‌చెరు): గడ్డపోతారం మున్సిపాలిటీ పరిధిలోని కాజీపల్లి సర్వే నంబర్ 181లో అక్రమ నిర్మాణాలు యథేచ్ఛగా కొనసాగుతున్నాయని గ్రామస్తులు నిరసన వ్యక్తం చేశారు. బుధవారం గ్రామస్తులు ఈ మేరకు ధర్నా నిర్వహించారు. అక్రమ నిర్మాణాలపై రెవెన్యూ యంత్రాంగం కఠినంగా వ్యవహరించాలని మండిపడ్డారు. ప్రభుత్వ భూములను కాపాడాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. అక్రమ నిర్మాణాలపై తగిన చర్యలు తీసుకోకుంటే ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ భార్గవ్, గ్రామస్తులు రజనీకాంత్, భానుకిరణ్, సురేష్, శమీర్, అంబెడ్, మిట్టు, గ్రామస్తులు పాల్గొన్నారు.

మంజీరాకు కొనసాగుతున్న వరద



మునిగిన వంతెనను పరిశీలిస్తున్న ఎంపీడీఓ

న్యాల్‌కల్(జహీరాబాద్): మంజీరా నదికి వరద ఉధృతి కొనసాగుతోంది. ఎగువ ప్రాంతం నుంచి భారీగా వరద నీరు వస్తుండటంతో బ్యాక్ వాటర్ వల్ల పంటలు నీట మునిగాయి. పరివాహక గ్రామాల సమీపంలోకి నీరు చేరడంతో ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చీకూర్తి గ్రామంలోని ఎస్సీ కాలనీలోని ఇళ్ల వద్దకు వరద నీరు చేరింది. బుధవారం డిప్యూటీ తహసీల్దార్ రాజిరెడ్డి, ఎంపీడీఓ శ్రీనివాస్ గ్రామాన్ని సందర్శించారు. అనంతరం వరద కారణంగా నీట మునిగిన వంతెనను పరిశీలించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వారి వెంట నాయకులు, గ్రామ పెద్దలు భూమారెడ్డి, జ్ఞానేశ్వర్ పాటిల్ తదితరులు ఉన్నారు.

రిటైర్డ్ వైస్ ఛాన్సలర్లకు సన్మానం



జయరాంరెడ్డి, కిషన్‌రావులను సన్మానిస్తున్న రాజశేఖర్ షెట్కార్ తదితరులు

జహీరాబాద్ టౌన్: పట్టణంలోని అనుభవ మండపంలో బుధవారం ఇద్దరు రిటైర్డ్ వైస్ ఛాన్సలర్‌లను లింగాయత్ సమాజ్ నాయకులు సన్మానించారు. శ్రీవెంకటేశ్వర యూనివర్శిటీ తిరుపతి రిటైర్డ్ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ జయరాంరెడ్డి, తెలంగాణ యూనివర్శిటీ రిటైర్డ్ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్‌ల తండెడి కిషన్‌రావులు బసవాది జీవన విధానం గురించి తెలుసుకోడానికి వీరు కర్నాటకలోని బసవకళ్యాణ్‌కు వెళ్తున్నారు. ఈ సందర్భంగా అనుభవ మండపాన్ని సందర్శించిన వీరిని లింగాయత్ సమాజ్ అధ్యక్ష కార్యదర్శులు రాజశేఖర్ షెట్కార్, ఆర్. సుభాష్ తదితరులు సన్మానించారు.

నేడు మాంసం విక్రయాలు బంద్

సంగారెడ్డి క్రైమ్: గాంధీ జయంతి సందర్భంగా గురువారం మాంసం విక్రయాలు చేయొద్దని బుధవారం సంగారెడ్డి మున్సిపాలిటీ పరిధిలోని మాంసం దుకాణాల యజమానులకు మున్సిపాల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి నోటీసులు అందజేశారు. డ్రైడే తప్పనిసరిగా పాటించాలని హెచ్చరించారు. నిబంధనలు పాటించకపోతే ట్రేడ్ లైసెన్స్ రద్దు చేసి జరిమానాలు విధిస్తామని స్పష్టం చేశారు.

పోలీస్‌స్టేషన్‌లో ఆయుధ పూజ

సంగారెడ్డి క్రైమ్: సంగారెడ్డి పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఆయుధ పూజలు బుధవారం ఘనంగా నిర్వహించారు. విజయదశమి పురస్కరించుకొని టౌన్ సీఐ రమేష్ ఆధ్వర్యంలో వాహనాలకు పూజలు చేశారు. ఈ సందర్భంగా పట్టణ సీఐ రమేష్ మాట్లాడుతూ.. పట్టణంలో శాంతిభద్రతల పరిరక్షణ, నేరాలు నియంత్రణలో విజయవంతం కావాలని అమ్మవారిని వేడుకున్నామన్నారు. అలాగే అమ్మవారి కరుణ, కటాక్షలు పోలీసులపై ఉండాలని ఆకాంక్షిస్తూ పూజలు చేశారు. కార్యక్రమంలో ఎస్సైలతో పాటు కానిస్టేబుళ్లు, పోలీసులు పాల్గొన్నారు.

తగ్గిన వరద ఉధృతి

- గౌడ్‌గాంజన్‌వాడ వాసులకు ఉపశమనం
- 400 ఎకరాల్లో నీట మునిగిన పంటలు
- ఆందోళనలో అన్నదాతలు



నీటమునిగిన పంట పొలాలు



వరద తగ్గడంతో రాకపోకలు సాగిస్తున్న గ్రామస్తులు

నారాయణఖేడ్: జలదిగ్బంధంలో చిక్కుకున్న నాగల్‌గిద్ద మండలం, గౌడ్‌గాంజన్‌వాడ గ్రామం చుట్టూ నీటి ఉధృతి బుధవారం కొంత అదుపులోకి వచ్చింది. నియోజకవర్గంలోని ఔదత్‌పూర్, ఏస్గి పరిధి వంతెన వద్ద నీరు ఉధృతంగా ప్రవాహిస్తుండటంతో రాకపోకలు నిలిచిపోయాయి. మహారాష్ట్ర, కర్ణాటక ఎగువ ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షాలకు తోడు కర్ణాటకలోని కరంజా ప్రాజెక్టు గేట్లు ఎత్తి నీటిని కిందకు వదలడంతో మంజీరా నదిలోకి భారీగా వరద వచ్చి చేరింది. బ్యాక్ వాటర్ కారణంగా గౌడ్‌గాం జన్‌వాడ గ్రామం చుట్టూ నీరు చేరడంతో గ్రామం జల దిగ్బంధంలో చిక్కుకుంది. సోమవారం అర్ధరాత్రి 12గంటల ప్రాంతంలో ఎమ్మెల్యే సంజీవరెడ్డి కర్ణాటకలోని కందుగుల్ మీదుగా గౌడ్‌గాం జన్‌వాడకు చేరుకొని గ్రామస్తులకు ధైర్యం చెప్పారు. కందుగుల్ వద్ద పాఠశాల భవనంలో ఉన్న గ్రామస్తులను పరామర్శించి వారికి తగిన ఏర్పాట్లు చేపట్టారు. అనంతరం మంగళవారం ఉదయం డిప్యూటీ కలెక్టర్ ఉమాహారతి, డీఎస్పీ వెంకట్‌రెడ్డి , రెవెన్యూ, పోలీసు, ఫైర్‌శాఖల అధికారులు గ్రామాన్ని సందర్శించి పరిస్థితిని పర్యవేక్షించారు.

నీటమునిగిన పంటలు

గ్రామం చుట్టూరా ఉన్న వ్యవసాయ పొలాలు నీట మునిగాయి. గౌడ్‌గాంజన్‌వాడ, ఔదత్‌పూర్, కారాముంగి గ్రామాల శివార్లలోని సుమారు 400 ఎకరాల్లోని పంటల్లోకి వరద నీరు చేరింది. పత్తి, సోయా, కంది తదితర పంటల్లో నీరు నిల్వడంతో పంటలు దెబ్బతినే ప్రమాదం ఉందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గురువారం వరకు వరద ఉధృతి దాదాపు పూర్తిగా తగ్గనుందని గ్రామస్తులు, అధికారులు పేర్కొంటున్నారు.

ఘనంగా ఆయుధ పూజ



ఆయుధ పూజలో పాల్గొన్న ఈడీ కేబీ.రాజా

రామచంద్రాపురం(పటాన్‌చెరు): బీహెచ్ఈఎల్ పరిశ్రమలో బుధవారం ఘనంగా ఆయుధ పూజ నిర్వహించారు. పరిశ్రమలోని పలు బ్లాక్‌ల్లో జరిగిన పూజా కార్యక్రమంలో భెల్ ఈడీ కె.బి.రాజా పాల్గొని కార్మికులకు దసరా శుభాకాంక్షలు తెలిపారు.

ఖేడ్‌లో విజయదశమి ఏర్పాట్లు



తహసీల్ గ్రౌండ్‌లో చేస్తున్న ఏర్పాట్లు

నారాయణఖేడ్: పట్టణంలో ప్రతీ ఏటా తరహాలోనే విజయదశమిని నిర్వహించేందుకు షెట్కార్ కుటుంబ సభ్యులు తహసీల్ గ్రౌండ్‌లో బుధవారం ఏర్పాట్లను ప్రారంభించారు. తహసీల్ గ్రౌండ్‌లో రావణ దహనం, తాత్కాలిక జంబి వృక్షం ఏర్పాటు, గానాబజానా తదితర కార్యక్రమాలను ఏర్పాటు చేస్తున్నారు. భక్తులు భారీసంఖ్యలో పాల్గొంటున్నందున బారికెడ్లు, అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నారు. ఆయా పనులను ఉమ్మడి మెదక్ జిల్లా జెడ్పీ ప్రణాళిక సంఘం మాజీ సభ్యులు నగేష్ షెట్కార్ మాజీ కౌన్సిలర్లు వివేకానంద్, హన్మాండ్లు, మాజీ ఎంపీపీ జీవులానాయక్, పురోహితులు మోహన్ జ్యోషితో కలిసి పర్యవేక్షించారు.